క్లుప్తంగా

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ 15 వర్ధంతి శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరాచారి, నాయకులు శ్రీమంతుల వేణుగోపాల్, తూమోజు సురేశ్‌చారి, రాధాకృష్ణచారి, రమేశ్, అశోక్‌చారి, వెంకటయ్యచారి, సంతోష్‌చారి, రవి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ జాడి కృష్ణ

వాంకిడి: బ్యాంకు ద్వారా అందించే రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ జాడి కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు ఆవరణలో బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీజీబీ ఆధ్వర్యంలో గృహ, విద్యా, మార్టిగేజ్, వాహన, పంట, మహిళ సంఘాలు, వ్యాపార రుణాలు తక్కువ వడ్డీ రేట్లతో అందించనున్నట్లు తెలిపారు. ఖాతాదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాసెసింగ్ ఆఫీసర్ సంధ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీముఖ్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పట్టాభిషేక మహోత్సవం


గురుపట్టాభిషేకం పొందుతున్న అరుణ్

కౌటాల: మండల కేంద్రంలోని పరిశుద్ధ వ్యాకులమాత చర్చిలో కౌటాలకు చెందిన కామ్రె అరుణ్ ఫాదర్‌గా గురుపట్టాభిషేక మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని హాజరై కామ్రె అరుణ్‌ను ఫాదర్‌గా పట్టాభిషేకం చేసి అభిషేకించారు. మాజీ బిషప్ జోసఫ్ కున్నత్, ఫాదర్లు జెమ్స్, మత్తయి, టోమ్ అంతోని, సీజో, శేరిన్, జోబి, వినోద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉండాలి


ఎల్లూర్‌లో మాట్లాడుతున్న శ్రీశైలం మాదిగ

పెంచికల్‌పేట్: హక్కుల సాధనకు మాదిగలు ఐక్యంగా పోరాటం చేయాలని పెంచికల్‌పేట్ మండల ఎంఆర్‌పీఎస్ కోఆర్డినేటర్ శ్రీశైలం మాదిగ అన్నారు. మండలంలోని ఎల్లూర్ గ్రామంలో శనివారం సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ మాదిగలు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని సూచించారు. ఇప్ప నగేశ్, గోలేటి రవి, బొందయ్య, వెంకటి, చిన్నన్న, బక్కయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదు'


వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

తాండూర్: కిష్టంపేట గ్రామపంచాయతీ ఇందిరమ్మ పథకం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని బీజేపీ నాయకులు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము నిరుపేదలమని గుర్తించి, తమకు గూడు కల్పించాలనే సదుద్దేశంతో ఇందిరమ్మ కమిటీ నాయకులు తమకు ఇళ్లు కేటాయిస్తే, వారు డబ్బులు తీసుకొని ఇళ్లు కేటాయించారని నిందలు వేయడం సరికాదన్నారు. నిజమైన లబ్ధిదారులకు మేలు జరుగుతుంటే అభినందించాల్సింది పోయి, ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిజనిజాలు బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని అన్నారు.


ఆసిఫాబాద్‌రూరల్: మోడల్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


రెబ్బెన: సింగరేణి పాఠశాలలో..


ఆసిఫాబాద్‌అర్బన్: జైలు ఆవరణలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్: యోగాతో సంపూర్ణ అరోగ్యం అందుతుందని ప్రిన్సిపాల్ మహేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మోడల్ స్కూల్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. జిల్లా కేంద్రంలోని మహిళ డిగ్రీ కళాశాల, సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల పీడీ శారద, తిరుపతి, ఈశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్, ఏపీఎం తిరుపతి పాల్గొన్నారు.

కెరమెరి: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండలంలోని గోయగాం, కెరమెరి ఉన్నత పాఠశాలలతో పాటు అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ప్రయోజనాలను ఆయూష్మాన్ యోగా మందిర్ శిక్షకుడు దినేష్ పురి వివరించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.


చింతలమానెపల్లి: బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీరోజు యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని జైలు పర్యవేక్షణ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ సబ్‌జైలులో సిబ్బంది, ముద్దాయిలతో యోగా సాధన చేయించారు.

పెంచికల్‌పేట్: మండలంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు సతీశ్, తిరుమల్‌గౌడ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలలోని డబ్బా గ్రామంలోని ఉపాధిహామీ పని స్థలంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. బాబాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంఈవో జయరాజ్‌లు యోగా ప్రాముఖ్యత వివరించారు.

కౌటాల: యోగాసనాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నారాయణ్ సింగ్, గణపతి, ఉపాధ్యాయులు రమేశ్, రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గోలేటి టౌన్‌షిప్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో మెగా యోగా శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 405 మంది ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగుల కుటుంబ స భ్యులు, ట్రేడ్ యూనియన్ నాయకులు యోగాసనా లు వేశారు. ఏరియా జనరల్ మేనేజర్ విజయ భా స్కర్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఏఐటీయూసీ గోలే టి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఎస్వోటూజీఎం రాజమ ల్లు, ఏరియా ఇంజనీరు రామనాథం, డీజీఎం సివి ల్ ఎస్‌కే మదీనా భాషా తదితరులు పాల్గొన్నారు.


కెరమెరి ఉన్నత పాఠశాలలో..


ఆసిఫాబాద్‌రూరల్: మహిళా డిగ్రీ కళాశాలలో..


పెంచికల్‌పేట్: సంజీవనగర్ పాఠశాలలో..


కౌటాల: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


దహెగాం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


లింగాపూర్: యోగా చేస్తున్న అధికారులు

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి


విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎస్‌వో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బెస్తవాడ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా ప్రవేశ్ మాడ్యూల్ ప్రకారం, ఎఫ్ఎల్ఎన్ బోధనా పద్ధతులు ఉపయోగించి విద్యాబోధన ద్వారా విద్యార్థులలో మంచి ఫలితా లు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం తల్లిదండ్రులకు వచ్చేలా టీచర్లు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి'


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని అమరవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థూపం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అమరవీరుల కుటుంబాలను ఇప్పటికే ఇంటి స్థలాలు ఇచ్చామని, నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయన్నారు. అమరవీరుల స్థూపాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానన్నారు. ముందుగా పిప్రి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రైతులతో మాట్లాడి భూ సమస్యలే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, జహీర్, మసుద్, జితేందర్, మీర్జా యాకుబ్‌బేగ్, కొరెంగా సుంకట్‌రావ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం'


దహెగాం: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్


కెరమెరి: పత్రాలు అందిస్తున్న కమిటీ సభ్యులు

దహెగాం: నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఇట్యాల, కోత్మీర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలు అందజేశారు. అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అన్ని హామీలు నెరవేరుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడితే బిల్లులు త్వరగా వస్తాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్, హౌసింగ్ ఏఈ సందీప్, మాజీ జెడ్పీటీసీ రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పోతుగంటి భీమన్న, నాయకులు గజ్జెల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం మండలంలోని అందవెల్లి గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. పంచాయతీ సెక్రటరీ ప్రణీత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు గజ్జి రామయ్య, నాయకులు బొగ శ్రీనివాస్, ఎర్ర నరేశ్, జక్కుల శ్రీకాంత్, కోడం రాజు, కొండు రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' పత్రాల పంపిణీ

కెరమెరి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 40 మంది ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు శనివారం మంజూరు పత్రాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్ అందించారు. మొత్తం 49 మందికి గృహాలు మంజూరు కాగా ప్రస్తుతం 40 మందికి అందించారు. త్వరలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు దండుగుల శ్రీనివాస్, సుజాయత్ ఖాన్, సాజిద్ దేశ్‌ముఖ్, కొట్రంగే తిరుపతి తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూస శంకర్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం మర్థిగి గ్రామానికి 22, లంబాడిగూడ గ్రామానికి చెందిన 7గురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా శనివారం లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో గురుదాస్, సాహిల్ అహ్మద్, ఆత్రం రాజన్న, లింగయ్య, దుర్గయ్య, వాజీద్, భీమక్క, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని గోయెగాం, వాంకిడి, జంబుల్‌ధరి గ్రామ పంచాయతీలలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ ఆధ్వర్యంలో మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కొలతల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని తద్వారా బిల్లులు విడతల వారీగా ఖాతాల్లో జమవుతాయన్నారు. హౌజింగ్ ఏఈ నాగరాజ్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పార్టీ నాయకులు మండోకార్ అనిల్, కృష్ణ, సెల్వట్‌కార్ పెంటు, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.

మేఘమా.. వర్షించుమా..!

- వర్షాలు లేక అన్నదాతల్లో ఆందోళన
- విత్తనాలు విత్తినా మొలకెత్తని వైనం

మండలంలో సాగు వివరాలు (అంచనా ఎకరాల్లో)	
పత్తి	17,000
కంది	2,500
సోయా	750
ఇతర పంటలు	3,550
మొత్తం	23,800

లింగాపూర్: మృగశిర కార్తె ప్రవేశించి రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించడం లేదు. ఇప్పటివరకు మండలంలో ఒక్క భారీ వర్షం కూడా పడలేదు. మృగశిర కార్తెలో విత్తనాలు విత్తుకున్న రైతులు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వాన కోసం రోజూ ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. రోజూ మేఘావృతమై ఉంటున్నా వర్షం మాత్రం పడడం లేదు. వారం క్రితం కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు కురవగా, అంతంత మాత్రంగా కురిసే వర్షాలకు విత్తిన విత్తనాలు మొలకెత్తక పాడైపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

వానాకాలంలో ఈ ఏడాది మండల వ్యాప్తంగా 17వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. పొలాలను చదను చేసి ఇప్పటివరకు సుమారు 90 శాతం పత్తి విత్తనాలు విత్తుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలో కొన్ని గ్రామాలలో చిన్నపాటి చిరుజల్లుల కురువడంతో వర్షాలు పడుతాయని రైతులు సంబుర పడ్డారు. కానీ వర్షాలు పడడం లేదు. ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేశామని వర్షం రాకపోతే మరోసారి పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.


దుక్కిలో విత్తినా మొలకెత్తని పత్తి విత్తనాలు

వాన కోసం..

వర్షాల జాడ లేకపోవడంతో వాన కోసం మండలంలోని పల్లెల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గత మూడేళ్లుగా అతివృష్టితో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈసారి బాగా పంటలు పండితే అప్పుల ఊబిలో నుంచి బయట పడతామని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.


వర్షం లేక ఎదగని పత్తి మొక్క

విత్తనాలు మొలకెత్తలేదు



నేను పోయిన వారం ఐదు ఎకరాలలో పత్తి పెట్టిన. పెద్ద వాన పడకపోవడంతో విత్తనాలు ఇంకా మొలకెత్తలేదు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన. వర్షం పడకుంటే తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. అప్పులు చేసి మళ్లీ విత్తనాలు కొనాల్సిన పరిస్థితి ఉంటుంది.

– జాదవ్ ఇందల్, రైతు, లింగాపూర్

తప్పని ఎదురుచూపులు



దుక్కులు దున్ని, విత్తనాలు విత్తి, వర్షం కోసం ఎదురు చూస్తున్నాం. నేను 8 ప్యాకెట్ల పత్తి విత్తనాలు వేసి సుమారు వారం రోజులు పూర్తయినా వర్షం లేక మొలకలు కూడా రావడం లేదు. కొంతమంది రైతులు రోహిణి కార్తెలో వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తాయి. కానీ వర్షాలు లేక మొక్కలు ఎదగడం లేదు.

– రాథోడ్ సంతోష్, రైతు, లింగాపూర్

పీహెచ్‌సీకి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించి ఏడాది కాకముందే గోడలకు అమర్చిన టైల్స్ ఊడిపోవడం, ప్రసూతి గదిలో బాత్‌రూం వద్ద టైల్స్ కుంగిపోవజడంతో 'సాక్షి'లో 'నాణ్యతకు పాతర..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. కుంగిన టైల్స్, గోడలకు అమర్చిన టైల్స్‌ను తొలగించే పనులు చేయిస్తున్నారు. గదులలో కుంగిన స్థలంలో టైల్స్‌ను తీస్తున్నారు.


ప్రసూతి గదిలో బాత్‌రూం వద్ద కుంగిన టైల్స్‌ను తొలగిస్తున్న మేస్త్రీ


గోడకు పగుళ్లు తేలిన టైల్స్‌ను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899